ప్రతి అడుగు డివిజన్ అభివృద్ధికే..

మన్సూరాబాద్: ప్రతి అడుగు ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికి శ్రమ పడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీ కమ్యూనిటీహాల్‌పై యోగా షెడ్ వేస్తామన్నారు. దెబ్బతిన్న సీసీ రోడ్లకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. కాలనీలోని అంతర్గత రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. కాలనీలోని ఖాళీ ప్రాంతాల్లో చెత్తవేయకుండ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బ్యానర్లు ఏర్పాటు చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చీర్క నర్సిరెడ్డి, మారం రాజేష్, జంగయ్యయాదవ్, మధుసూధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మచారి, సతీష్, లింగస్వామి, యాదిరెడ్డి, రుద్రారెడ్డి, విష్ణుమూర్తి, కరుణాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.40లక్షల చెక్కుల పంపిణీ

నాగోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట, ముత్తూట్ సీఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు కోర్సు పూర్తి అయ్యేంత వరకు పూర్తిస్థాయి ఫీజు మద్దతు ఇచ్చే విధంగా రూ.40లక్షల చెక్కులను శుక్రవారం ఎస్సీ, ఎస్టీ మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాష్ట్ర సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల చదువులు ప్రోత్సహించే విధంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ కొత్తపేట చైర్మన్ లయన్ విజయరంగ, ముత్తూట్ మేనేజర్ లక్ష్మీనారాయణను అభినందించారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొగ్గారపు వరుణ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని... శ్రీరమణకాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కరానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని శ్రీరమణ కాలనీవాసుల విన్నపం మేరకు శుక్రవారం ఆమె కాలనీలో పర్యటించారు. అధికారులను పిలిపించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.... డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలందరికి మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మమత, మల్లేష్‌గౌడ్, సతీష్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగోలులో పోలీసుల తనిఖీలు

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్‌లోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నాకబందీ నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిషేధిత వస్తువులు, అక్రమ మారణాయుధాలు, ఇల్లీగల్ వెహికల్స్ తరలింపును అరికట్టే ఉద్దేశంతో ఈ తనిఖీలు నిర్వహించారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీలల్లో సీపీఎస్ ఏసీపీ సూర్యప్రకాష్‌రెడ్డి, నాగోలు సీఐ సూర్యనాయక్, ఎస్సై రమేష్‌తో ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల వేళ.. ఆధ్యాత్మిక శోభ.!


మాతా మైదాన్‌లోని శ్రీవిజయదుర్గామాతా ఆలయం

- బోనాల పండగకు ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- విద్యుద్దీపాల వెలుగులో ఆలయాల పరిసరాలు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాల స్వాగత తోరణాలు


ఐఎస్‌సదన్ డివిజన్ విష్ణునగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం


ముస్తాబవుతున్న పెద్దతోటలోని వాగామ్రి అమ్మవారి దేవాలయం

సైదాబాద్: ఆదివారం నాడు అంగరంగ వైభవంగా నిర్వహించుకునే ఆషాఢమాస బోనాల వేళ అమ్మవారి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బోనాల మహోత్సవాల కోసం సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్‌ల పరిధిలోని అమ్మవారి దేవాలయాలు సిద్ధమవుతున్నాయి. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే అమ్మవారి బోనాల మహోత్సవాలకు ఆయా కాలనీలు, బస్తీలలోని ఆలయాలను కమిటి ప్రతినిధులు సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. నిర్వాహకులు ఆలయాలకు కొత్త రంగులు వేయించి, విద్యుత్ దీపాలు పూలతో ఆలయాలను అలంకరించారు.

◆ ఆదివారం ఉదయం తెల్లవారుఝాము నుండే భక్తులు, మహిళలు ఆయా ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివస్తారు కాబట్టి వారికి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయించారు. సైదాబాద్, ఐఎస్‌సదన్‌లలో ఆదివారం అమ్మవారికి బోనాల సమర్పణ, ఫలహారం బండ్లు ఊరేగింపు, సోమవారం శ్రద్ధాబాద్ మహంకాళి జాతర సందర్భంగా ఘనంగా ఘటాల ఊరేగింపుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసారు.

◆ సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గా మాతా ఆలయం, జీవన్‌జ్యోతిలోని జయదుర్గా ఆలయం, సైదాబాద్ పెద్దతోటలోని వాగామ్రి మాతా ఆలయం, మాతృశ్రీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని విష్ణునగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం, నాగులమ్మ దేవాలయాలను బోనాల ఉత్సవాల కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బోనాల మహోత్సవాలలో భాగంగా శ్రద్ధాబాద్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో పాతబస్తీలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అమ్మవారి ఘటాల ఊరేగింపు కోసం జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, పోలీస్ విభాగం అధికారులు బారికేడ్లు, మంచినీటి సదుపాయాలు, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఏర్పాట్లు పూర్తి

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి సీతక్క

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని ఖిల్లా మైసమ్మ అమ్మవారిని శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. వచ్చే ఆదివారం జరిగే బోనాలకు ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించడానికి మంత్రి సీతక్క విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను చైతన్యపురి పోలీస్‌లతో కలిసి దేప భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగను అత్యంత వైభవంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్ నేత, దనరాజ్ గౌడ్, పెద్దవూర సైదులు, జంగారెడ్డి, శ్రీశైలం, సందీప్, నబి, సంతోష్, విప్లవరెడ్డి, ఆలయం చైర్మన్ సురేంద్రకుమార్ (సురేష్), గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాతృశ్రీ కాలనీలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం


ఖిల్లా మైసమ్మ దేవాలయ ఆవరణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న భాస్కర్‌రెడ్డి

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బోనాలకు ముస్తాబవుతున్న ఆలయాలు


మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవాలయం ముందు ఏర్పాటు చేస్తున్న భారీ సెట్టింగ్


దేవాలయంలో కొలువైన పోచమ్మదేవి అమ్మవారు

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆషాఢమాసం చివరి ఆదివారం బోనాల ఉత్సవాలకు పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చివరిదశలో ఉన్నాయి. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మన్సూరాబాద్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

◆ మన్సూరాబాద్‌లోని శుభోదయకాలనీలో విజయదుర్గ దేవాలయం, జడ్జెస్‌కాలనీలో నల్లపోచమ్మ, గ్రామంలోని చిత్తారమ్మ, పెద్దచెరువు కట్టపై కట్టమైసమ్మల దేవాలయాలను బోనాల ఉత్సవాలకు ముస్తాబు చేశారు. మన్సూరాబాద్‌లోని ప్రధాన దేవాలయం పోచమ్మగుడిలో బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. బోనాల ఉత్సవాల కోసం పోచమ్మ దేవాలయం ఏదుట ప్రత్యేకంగా భారీసెట్‌ను వేస్తున్నారు. పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎంతో విశిష్టత కలిగిన పోచమ్మ దేవాలయానికి వేల సంఖ్యలో భక్తులు బోనాలు సమర్పిస్తారు. భక్తుల రద్దీకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, ఆలయాల ఎదుట బోనాలు సమర్పించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

విద్యుద్దీపాలతో అందంగా అలంకరించాం..



బోనాలు సమర్పించే భక్తులకు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయం చుట్టూ శామియాలు వేస్తున్నాం. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించాం. ఆలయం ఎదుట ఆకర్షణీయంగా భారీ సెట్టింగ్ వేశాం. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం సహకరించాలి. పారిశుద్ధ్య పనులు జీహెచ్ఎంసీ చేపట్టేలా అధికారులు, ప్రజాప్రతనిధులు చర్యలు చేపట్టాలి.

– కొప్పుల విఠల్‌రెడ్డి, పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్

21 నుంచి హైదరాబాద్ మాన్సూన్ రేసెస్


సమావేశంలో మాట్లాడుతున్న రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: హైదరాబాద్ మాన్సూన్ రేసెస్ 2025 జులై 21 నుంచి ప్రారంభమై అక్టోబర్ 31 వరకు జరుగుతాయని హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మలక్‌పేట రేస్ కోర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్ కోసం 26 రేస్ సమావేశాలు రూపొందిచబడ్డాయని, మాన్సూన్ రేసెస్ 2025 కోసం ప్రైజ్‌మనీగా రూ13,80,80,000గా ప్రకటించామని పేర్కొన్నారు. భారత దేశంలోనే ఇంత పెద్ద ప్రైజ్‌మనీ ఎక్కడా లేదని ఆయన తెలిపారు. పది సంవత్సరాల్లో హెచ్ఆర్సీలో రేస్‌డేల సంఖ్య దేశంలోనే అత్యధికమని ఆయన తెలిపారు. వీటిలో 166 రెండేళ్ల వయసున్న గుర్రాలు ఉన్నాయని తెలిపారు. ఆగస్టు 24న గవర్నర్ కప్, 31న కోరమండల్ ఏపీజే అబ్దుల్ గ్లామర్ డెక్కన్ ఫిల్లీస్ ఛాంపియన్షిప్ స్టేక్స్ గ్రేడ్–3, సెప్టెంబర్ 7న వై.శంకర్‌రావు మెమోరియల్ డెక్కన్ కోల్ట్స్ ఛాంపియన్షిప్ స్టేక్స్, 14న భారతదేశ అధ్యక్షుడు గోల్డ్ కప్ గ్రేడ్–2, అక్టోబర్ 2న లెక్కలు డెక్కన్ డెర్బీ గ్రేడ్–1, అక్టోబర్ 27న గోల్కొండ సెయింట్ లెగర్ గ్రేట్–2 పందాలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు. హెచ్ఆర్సీలో 24 మంది ఏ లైసెన్స్, ఏడు మంది బీ లైసెన్స్ పొందిన శిక్షకులు 21 మంది లైసెన్స్ పొందిన జాకీలు 5 మంది అప్రెంటీస్ జాకీలు, 11 మంది డి లైసెన్స్ పొందిన జాకీలు ఉన్నారని ఆయన తెలిపారు.

ప్రయాణికులతోనే ఆర్టీసీ సంస్థకు మనుగడ

డిప్యూటీ రీజినల్ మేనేజర్ శంకర్‌నాయక్

హయత్‌నగర్: ప్రయాణికులె సంస్థకు రక్షణ అని వారికి మెరుగైన సేవలు అందిస్తేనే ఆర్టీసీకి మనుగడ ఉంటుందని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం హయత్‌నగర్–1 బస్ డిపోలో జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంస్థ అభివృద్ధిలో కొనసాగాలంటే ప్రతి ఉద్యోగి బాధ్యతతో పని చేయాలన్నారు. సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుంటున్న మహిళల పట్ల మర్యాదగా ఉండాలన్నారు.వారి టికెట్ డబ్బులు ప్రభుత్వం ఇస్తున్నందున వారు ఫ్రీగా ప్రయాణం చేస్తున్నట్లు భావించొద్దన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల అమలులో సంస్థ ఉద్యోగులు కూడా బాధ్యతతో పని చేయాలన్నారు. ఇంధనాన్ని పొదుపుగా వాడిన డ్రైవర్లు, అధిక కలెక్షన్లు తెచ్చిన కండక్టర్లు, బస్సుల నిర్వాహణలో బాగా పని చేసిన గ్యారేజీ సిబ్బందికి నగదు పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు.

నాణ్యతతో రోడ్లను నిర్మించాలి

ఎల్‌బీనగర్: కాలనీలలో రోడ్లను ఎక్కువ రోజులు మన్నిక ఉండే విధంగా నాణ్యత పాటించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైదేహినగర్‌లో నూతనం మంజూరైన రోడ్లను కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రోడ్లపై నీరు నిలువ ఉండకుండా లెవల్స్ చూసుకోని వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ గోపాలకృష్ణ, కాలనీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, కిషన్‌రావు, జంగారెడ్డి, శివరాం ప్రసాద్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రంక్ లైన్ల ఏర్పాటుతో ముంపు సమస్య తీరింది


సాగర్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సత్యంచారి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గంలోని వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్‌ల పరిధిలోని అనేక ప్రాంతాలలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను ట్రంక్‌లైన్ల ఏర్పాటుతో నివారించామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాగర్‌రింగ్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ట్రంక్ లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం వర్షాకాలంలో హస్తినాపురం, వనస్థలిపురం డివజన్‌లలో అనేక కాలనీలు ముంపునకు గురయ్యేవని తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి పనులను పూర్తి చేయించామని పేర్కొన్నారు. సాగర్‌రింగ్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న ట్రంక్‌లైన్ పూర్తయితే రెండు డివిజన్ల ముంపు సమస్య పూర్తిగా తీరుతుందన్నారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పర్కిరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు రవిముదిరాజ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారిపై వరద ప్రవాహం

దంచికొట్టిన వర్షం.. రోడ్లన్నీ జలమయం!


ఎల్‌బీనగర్‌లో రహదారిపై ఇలా..


గడ్డిఅన్నారం వైభవ్ టిఫిన్ సెంటర్‌లో..

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో రహదారులు ఏరులను తలపించాయి. గడ్డిఅన్నారం డివిజన్‌లోని న్యూదిల్‌సుఖ్‌నగర్, పీఅండ్‌టీ కాలనీ, వైభవ్ గల్లి, బీఎన్‌రెడ్డి డివిజన్, వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీలలో వరద నీరు మోకాళ్ల లోతు వరకు వచ్చింది. చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. మలక్‌పేట్‌లోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. రహదారులు గోదారిని తలపించడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, చాదర్‌ఘాట్, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొన్ని గంటల పాటు విద్యుత్ లేకపోవడం,ఆగకుండా కురుస్తున్న వర్షానికి ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రహదారులు వరదనీటితో నిండిపోవడంతో గుంతెక్కడో.. రోడెక్కడో తెలియని పరిస్థితి నెలకొంది.

– చైతన్యపురి/దిల్‌సుఖ్‌నగర్


మలక్‌పేట్ అక్షయ్ హోటల్ వద్ద వరద ప్రవాహం


మూసారాంబాగ్ రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


సైదాబాద్ నుంచి సరూర్‌నగర్‌కు వెళ్లే రహదారిపై వాహనదారుల ఇక్కట్లు


సాయినగర్‌లో వరద నీరు వెళ్లేలా సిబ్బంది తిప్పలు


చైతన్యపురి నాలా వద్ద